
8లో

## ప్రెస్ క్లబ్‌కు అండగా ఉంటా..

వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని

క్రీడల పోస్టర్ ఆవిష్కరణ


# వరంగల్ వాయిస్

Evening Daily

www.warangalvoice.net

వరంగల్ | సంపుటి : 03 | సంచిక : 291 శనివారం | 01 జూన్ 2024 | పేజీలు : 08 | వెల రూ. 5




వివరాలు 2లో..

# నకిలీపై నజర్

భారీగా పట్టుబడుతున్న నాసిరకం పత్తి విత్తనాలు

అయినా ఆగని దందా

అమాయక రైతులే టార్గెట్‌గా విక్రయాలు

గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు

నట్టేట ముసుగుతున్న అన్నదాతలు

నకిలీ పత్తి విత్తనాల విక్రయాలపై అన్ని జిల్లాల కలెక్టర్‌లతోపాటు పోలీస్ అధికారులు, వ్యవసాయ శాఖ దృష్టి సారించింది. అక్రమాలకు పాల్పడితే పీడీ యాక్ట్ నమోదు చేస్తామంటూ హెచ్చరికలు జారీ చేశారు. పలు ప్రాంతాల్లో పెద్ద మొత్తంలో నకిలీ విత్తనాలను స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు ఇప్పటికే అన్ని జిల్లాల పరిధిలో ఫర్టిలైజర్ షాపుల యజమానులు, డీలర్లతో కలెక్టర్లు సమావేశం నిర్వహించి నకిలీ విత్తనాల విక్రయదారులపై కొరడా ఝులిపించినట్లు ప్రకటించారు. స్వయంగా కలెక్టర్లే ఆకస్మిక తనిఖీలు నిర్వహించి స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అయినా ఈ దందా ఆగడం లేదు. అమాయక రైతులే టార్గెట్‌గా విక్రయాలు కొనసాగుతున్నాయి. అయితే నకిలీ విత్తనాలను అరికట్టడంలో పోలీసులు విఫలమవుతున్నారని పలువురు బహిరంగంగా ఆరోపిస్తున్నారు. వారు కఠినంగా వ్యవహరించకపోవడంతోనే దందా జోరుగా సాగుతోందంటున్నారు. వారి ఉదాసీనతే నకిలీ విత్తన దారులకు వరంగా మారుతుందంటున్నారు. అందిపుచ్చుకున్న సాంకేతిక పరిజ్ఞానంతో ఎలాంటి కేసులనైనా క్షణాల్లో ఛేదించే పోలీసులకు నకిలీ విత్తన విక్రయదారులు కొరకరాని కొయ్యగా మారుతున్నారా అంటూ విమర్శిస్తున్నారు. - వరంగల్ వాయిస్, వరంగల్/మరిపెడ


8 లో..

## ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

కొండగట్టుకు తరలిన భక్తులు

ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు


8లో..

## ఆవిర్భావ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

అనారోగ్య కారణాలతో సోనియా పర్యటన రద్దు

## బిర్యాని సెంటర్‌లో ఘర్షణ

**తోపులాటలో కిందపడి ఒకరి మృతి**



నగరంలోని ఒక బిర్యాని సెంటర్‌లో శుక్రవారం రాత్రి ఇద్దరు యువకుల మధ్య జరిగిన తోపులాట ఒకరి ప్రాణాలను తీసింది. వివరాల్లోకి వెలితే..నగరంలోని 18వ డివిజన్ లేబర్ కాలనీ సమీపంలోని బిర్యాని సెంటర్‌లో కాంగ్రెస్ నాయకుడు జన్ను అరవింద్, ఆటో డ్రైవర్ ప్రేమ్ సాగర్‌ల మధ్య బిర్యాని రేటు విషయంలో ఘర్షణ జరిగింది. దీంతో అరవింద్ ఆగ్రహంతో ప్రేమ్ సాగర్‌ను నెట్టివేయడంతో కిందపడిపోయాడు. తలకు బలమైన గాయం కావడంతో ఆయన అక్కడికక్కడే మృతి చెందారు. ఈ మేరకు మిల్స్ కాలని పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.
- వరంగల్ వాయిస్, కాశిబుగ్గ

# నకిలీపై నజర్





**భారీగా పట్టుబడుతున్న నాసిరకం పత్తి విత్తనాలు**

**అయినా ఆగని దందా**

**అమాయక రైతులే టార్గెట్ గా విక్రయాలు**

**గ్రామాల్లో యథేచ్ఛగా అమ్మకాలు**

**నట్టేట మునుగుతున్న అన్నదాతలు**

**వరంగల్ వాయిస్, మరిపెడ :** వానాకాలం సీజన్ సమీపిస్తుండగానే గ్రామాల్లో నకిలీ పత్తి విత్తనాల జోరు కనిపిస్తుంది. దళారులు ముందస్తుగానే నాసిరకం విత్తనాలను రైతులకు అంటగట్టేందుకు ప్రణాళికలు రూపొందిస్తారు. అమాయక రైతులే టార్గెట్ గా దందా సాగిస్తున్నారు. ప్రతీ వానాకాలంలో నాసిరకం, నకిలీ విత్తనాల బెడద రైతులకు పెను సవాల్‌గా మారింది. ఫర్టిలైజర్ వ్యాపారుల మాయజాలంతో రైతులు మోసపోతున్నారు. ధనార్జనే ధ్యేయంగా కొందరు ఈ దందాను సాగిస్తుంటే అసలు ఏదో, నకిలీ ఏదో గుర్తించలేక రైతులు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. వానాకాలం సీజన్‌కు ముందే గ్రామాల్లో తిష్ఠ వేసి రైతులను నట్టేట ముంచుతున్నారు. అమాయక రైతులే టార్గెట్‌గా ఈ ముఠాలు చెలరేగిపోతున్నాయి. అనుమతి లేని విత్తనాలు అన్నదాతలకు అంటగడుతూ అందినకాడికి దండుకుంటున్నాయి. ప్రతి ఏడాది మాదిరిగానే ఈ ఏడాది సైతం అదే రిపీట్ అయింది.

## వార్నింగ్ బలాదూర్..

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్లతోపాటు పోలీసులు వార్నింగ్ ఇస్తున్నా.. ఎక్కడ కూడా కేటుగాళ్ల ఆగడాలకు అడ్డుకట్ట పడటం లేదు. వరంగల్, మహబూబాబాద్, ములుగు, జనగాం, భూపాలపల్లి జిల్లాల్లోని గ్రామీణ, ఏజెన్సీ ప్రాంత వాసులే లక్ష్యంగా నకిలీ విత్తన విక్రయాలు సాగుతున్నాయి. నకిలీ విత్తనాలు అమ్మడానికి దళారులు యత్నిస్తూనే ఉన్నారు. గ్రామాల్లో నకిలీ విత్తనాల దందా యథేచ్ఛగా సాగుతూనే ఉంది. నకిలీ విత్తనాలు అమ్మితే పిడీ యాక్ట్ నమోదు చేస్తామన్న పోలీసులు హెచ్చరికను పట్టించుకునే వారే కరువయ్యారు.

## అనుమతి లేని విత్తనాల పట్టివేత..

ప్రభుత్వ ఆదేశాల మేరకు వ్యవసాయ శాఖ అధికారులు, పోలీసులు నిర్వహించిన తనిఖీలో పర్మిషన్ లేని ఏరియాలో విత్తనాల ప్యాకెట్లు అమ్ముతున్న కేసముద్రం మండలం పెనుగొండ గ్రామ శివారు మగ్రి తండాకు చెందిన ఆగ్రో సీడ్స్ షాపు యజమాని భూక్య నాగును పోలీసులు పట్టుకున్నారు. ఆయన నుంచి రూ.1.26 లక్షల విలువ కలిగిన 120 విత్తన ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు భూక్య నాగుపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

## అయోమయంలో అన్నదాతలు

సీజన్ ముందే విత్తనాల పంపిణీలో ప్రభుత్వ నిర్లక్ష్యంతో అన్నదాతలు అయోమయానికి గురయ్యారు. సరిపడా విత్తనాలు అందుతాయా లేదా అని రైతులు సందిగ్ధంలో ఉన్నారు. ఈ సీజన్‌లో ప్రారంభంలోనే మండలంలో నకిలీ విత్తనాలను అధికారులు పట్టుకోవడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతోంది. ఓవైపు అక్రమార్కులపై జిల్లా కలెక్టర్, ఎస్పీల ఆదేశాల మేరకు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి ఉక్కుపాదం మోపుతున్నా మరోవైపు అనుమతిలేని విక్రయాలు విస్తుగొలుపుతున్నాయి. మరింత అప్రమత్తం కాకపోతే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని గత అనుభవాలు హెచ్చరిస్తున్నాయి.

## నకిలీ విత్తనాలు విక్రయిస్తే పీడీ యాక్ట్..

అన్నదాతను నమ్మించి నకిలీ విత్తనాలను విక్రయిస్తే సహించేది లేదని వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా హెచ్చరించారు.ఎవరైన నకిలీ విత్తనాలను విక్రయించినా, సరఫరా చేసినా వారిపై పీడీ యాక్ట్ అమలు చేస్తామన్నారు. ఎవరైన నకిలీ విత్తనాలు విక్రయిస్తే తక్షణమే 8712685070 వాట్సప్ నంబర్‌కు సమాచారం అందించాలన్నారు. సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని సీపీ తెలిపారు.

# భారీగా నకిలీ పత్తి విత్తనాల పట్టివేత

**122 లీటర్ల గడ్డిమందు స్వాధీనం**

**పోలీసుల అదుపులో ఇద్దరు కేటుగాళ్లు**

**వివరాలు వెల్లడించిన సీపీ అంబర్ కిషోర్ ఝా**




**వరంగల్ వాయిస్, వరంగల్ :** వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో నకిలీ పత్తి విత్తనాలను విక్రయిస్తున్న అంతర్ రాష్ట్ర ముఠాలోని సభ్యుడితో పాటు ప్రభుత్వ నిషేధిత గడ్డిమందును విక్రయిస్తున్న మరొకరిని టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా అరెస్ట్ చేయగా మరో ఇద్దరు నిందితులు పరారీలో ఉన్నారు. ఈ రెండు సంఘటనల్లో పోలీసులు సుమారు రూ.10 లక్షల విలువైన 310 కిలోల నకిలీ పత్తి విత్తనాలు రెండు సెల్‌ఫోన్లు, రూ.1.10 లక్షల విలువైన 122 లీటర్ల నిషేధిత గడ్డి మందును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ అరెస్టుకు సంబంధించి వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా శనివారం వివరాలను వెల్లడించారు. సంగెం మండలం, గాంధీనగర్ కు చెందిన నిందితుడు కోదూరి శ్రీనివాస్‌రావు, తనకు వరసకు మామా అయిన సూర్యపేట జిల్లా, తిరుమలగిరి ప్రాంతానికి చెందిన నగామల్లేశ్వర్ రావుతో కలిసి గుంటూరు జిల్లా పెద్దకూరపాడుకు చెందిన ఏటుకూరి సుబ్బరావు వద్ద పెద్ద మొత్తంలో నకిలీ పత్తి విత్తనాలను తక్కువ ధరకు కొనుగోలు చేశారు. ఈ విత్తనాలు గడ్డి మందును తట్టుకొనే శక్తి కలిగి ఉండటంతో పాటు దిగుబడి అధికంగా వస్తుందని, ఎక్కువమార్లు కలుపు తీయాల్సిన అవసరం లేదని, స్థానిక అధీకృత డీలర్ల వద్ద ఈ విత్తనాలు లభ్యం కావని తప్పుడు ప్రచారం చేస్తూ అమాయక రైతులకు ఎక్కువ ధరకు విక్రయించేవారన్నారు. సమాచారం పోలీసులకు అందడంతో టాస్క్‌ఫోర్స్, సంగెం పోలీసులు సంయుక్తంగా దాడి నిర్వహించి నకిలీ పత్తి విత్తనాలతో పాటు, ప్రభుత్వ నిషేధిత 50 లీటర్ల గడ్డి మందును స్వాధీనం చేసుకొని నిందితుడు శ్రీనివాస్‌రావు అదుపులోకి తీసుకున్నారు. మరో సంఘటనలో సంగెం మండలం, తిమ్మాపూర్ గ్రామానికి చెందిన మెంతుల రాజేష్ ప్రభుత్వం నిషేధించిన గడ్డి మందుకు ఇంటి వద్ద అక్రమంగా విక్రయిస్తున్నట్లుగా టాస్క్‌ఫోర్స్ పోలీసులకు సమాచారం రావడంతో పోలీసులు నిందితుడి ఇంటిలో తనిఖీ చేయగా 72లీటర్ల గడ్డిమందును పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు.

# ఉత్సవాల్లో పాల్గొనం

**తెలంగాణ ఉద్యమాన్ని రక్తసిక్తం చేసిన చరిత్ర కాంగ్రెస్‌ది**

**సీఎం రేవంత్ రెడ్డికి కేసీఆర్ బహిరంగ లేఖ**



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ అభివృద్ధిని తిరోగమన దిశలో సాగిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వహిస్తున్న తెలంగాణ దశాబ్ది అవతరణ ఉత్సవాల్లో పాల్గనరాదని నిర్ణయించినట్లు మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ స్పష్టం చేశారు. ఈ మేరకు తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి భారాస అధినేత కేసీఆర్ 22 పేజీల సుదీర్ఘ లేఖ రాశారు. రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలకు రావాలని ఆహ్వానం పంపిన నేపథ్యంలో ప్రజల పక్షాన బహిరంగ లేఖ రాస్తున్నట్టు తెలిపారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితం.. అమరుల త్యాగాల పర్యవసానం. కానీ, కాంగ్రెస్ దయాభిక్షగా వీరీరు చేస్తున్న ప్రచారాన్ని నిరసిస్తున్నాను. 1969 నుంచి ఐదు దశాబ్దాలు, భిన్నదశలలో, భిన్నమార్గాలలో ఉద్యమ ప్రస్థానం సాగింది. తెలంగాణ ఉద్యమాన్ని కాంగ్రెస్ రక్తసిక్తం చేసిందనేది వీరీరు దాచేస్తే దాగని సత్యం. 1952 ముల్కీ ఉద్యమంలో సిటీ కాలేజీ విద్యార్థులపై కాల్పులు జరిపి నలుగురు విద్యార్థుల ప్రాణాలు పొట్టన పెట్టుకున్నది ఆదిగా.. కాంగ్రెస్ క్రూర చరిత్ర కొనసాగింది. తెలంగాణ దశాబ్ది ఉత్సవం ఒక ఉద్విగ్న, ఉత్తేజకరమైన సందర్భమే. అయితే, కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతోందన్న ఆరోపణలు వెల్లువెత్తుతోన్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని భారాస, తెలంగాణ వాదుల అభిప్రాయంగా ఉందని కేసీఆర్ లేఖలో పేర్కొన్నారు. అందుకే రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించే వేడుకల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని వెల్లడిరచారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న కాంగ్రెస్ పోకడలను నిరసిస్తున్నామని తెలిపారు. రాష్ట్ర అవతరణ సుదీర్ఘ ప్రజా పోరాట ఫలితమని, అమరుల త్యాగాల పర్యవసానమనీ కాకుండా.. కాంగ్రెస్ దయాభిక్షగా ప్రచారం చేస్తున్న ఆ పార్టీ భావ దారిద్యాన్ని నిరసిస్తున్నానని చెప్పారు. ఇకన్నైనా వైఖరిని మార్చుకుని సంక్షేమానికి పాటుపడాలని సూచించారు. ఇక ముందైనా తెలంగాణ వ్యతిరేక మానసికత నుంచి బయటపడి జై తెలంగాణ అని నినదించే వివేకాన్ని తెలంగాణ సమాజం వీరీ నుంచి కోరుకుంటుందని చెప్పారు. ముఖ్యమంత్రి అయ్యి ఆరు నెలలవుతున్నా ఇప్పటివరకు తెలంగాణ అమరవీరుల స్థూపాన్ని సందర్శించకుండా, శ్రద్ధాంజలి ఘటించకుండా తెలంగాణ మనోభావాలను తీవ్రంగా గాయపరిచారని అన్నారు. వీరీ ప్రవర్తనతో, వీరీ పార్టీ ప్రవర్తనతో కాంగ్రెస్ ఇప్పటికీ మారలేదు.. ఇక మారదు.. ఇక ముందు మారే అవకాశం లేదని స్పష్టమవుతుందని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్రాన్ని తిరోగమన దిశగా తీసుకుపోతున్నది ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ప్రభుత్వం నిర్వహిస్తున్న ఉత్సవాల్లో కేసీఆర్ పాల్గొనడం సమంజసం కాదని.. బీఆర్ఎస్ పార్టీతో సహా ఉద్యమకారులు, తెలంగాణ వాదులు అభిప్రాయంగా ఉందని కేసీఆర్ అన్నారు. తెలంగాణ అస్తిత్వాన్ని అవమానిస్తున్న వీరీ వికృత పోకడలను నిరసిస్తూ.. వీరీరు నిర్వహించే దశాబ్ది ఉత్సవాల్లో బీఆర్ఎస్ పాల్గొనడం లేదని తెలియజేయడానికి విచారిస్తున్నామని అన్నారు. ఇక ముందైనా ఇటువంటి వైఖరిని మానుకొని నిజమైన ప్రగతి కోసం, సంక్షేమం కోసం ప్రయత్నిస్తారని, ఎన్నికల వాగ్దానాలన్నీ త్వరగానే నెరవేరుస్తారనీ ప్రజల మన్ననలు పొందుతారని ఆశిస్తున్నామని లేఖలో పేర్కొన్నారు.

## మిల్క్ పార్లర్ ప్రారంభోత్సవం



**వరంగల్ వాయిస్, శాయంపేట :** మండల కేంద్రంలో కోదూరి తిరుపతి–అరుణ దంపతులు ఏర్పాటు చేసిన అరుణ మిల్క్ నూతన పార్లర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శనివారం భూపాలపల్లి ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణ రావు పాల్గొని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఆర్ అధినేత సంపత్ రావు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి, మాజీ ఎంపీపీ బాసని చంద్రప్రకాష్, మండల అధికార ప్రతినిధి చిందం రవి, మారపల్లి రవీందర్, మండల ఉపాధ్యక్షుడు మారపల్లి కటయ్య, ఐఎన్టీయూసీ మండల అధ్యక్షుడు మారేపల్లి రాజేందర్, వరదరాజు, ఎండీ సాదిక్, మాదిరెడ్డి ప్రపంచరెడ్డి, మాజీ ఎంపీటీసీ కొమ్ముల భాస్కర్, ఎండీ రఫీలతో పాటు పలువురు ముఖ్య నాయకులు ఉన్నారు.

## ఫీజుల నియంత్రణ చట్టం తీసుకు రావాలి

### ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** ప్రైవేట్ పాఠశాలలో ఫీజుల నియంత్రణకు విద్యాశాఖ అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. మరిపెడ మండలంలోని ప్రైవేటు పాఠశాలలో ఇష్టారీతిగా ఫీజుల పెంచుతున్న అధికారులు మాముళ్ల మత్తులో మునిగిపోతున్నారని అన్నారు. అలాగే, ఫీజుల ఇష్టారీతిగా పెంచి తల్లిదండ్రులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని అన్నారు. ప్రైవేట్ పాఠశాలలో బుక్స్, యూనిఫాంను యాజమాన్యం ఇష్టం వచ్చిన ధరలకు అమ్ముతున్నారని తెలిపారు. ఫీజుల పేరుతో విద్యార్థులను ఇబ్బందులకు గురిచేస్తున్న పాఠశాలలపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

## మంత్రి కొండా సురేఖను కలిసిన మార్నేని



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** అటవీ, పర్యావరణ, దేవదాయ శాఖ మంత్రి కొండా సురేఖను, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్ రావు ను హైదరాబాద్ లోని వారి స్వగృహంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి పుష్పగుచ్ఛంతో పాటు బ్యాంకు మెమొంటో అందజేసి ప్రభుత్వ డిపాజిట్లు సహకార బ్యాంకులలో చేయాలని కోరారు.

## ఎమ్మెల్యే యశస్విని రెడ్డి ప్రత్యేక పూజలు



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పట్టణంలోని పాలకేంద్రం వద్ద ఆంజనేయస్వామి ఆలయంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన హనుమాన్ జయంతి ఉత్సవాల్లో స్థానిక శాసన సభ్యురాలు యశస్విని రెడ్డి ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, మహిళా నాయకులు, వ్యాపారస్తులు, తదితరులు, ఉన్నారు.

# ఘనంగా ఏఎస్సై గండి సదయ్య ఉద్యోగ విరమణ

### సత్కరించిన కొత్తగూడెం ఎస్పీ రోహిత్ రాజు



**వరంగల్ వాయిస్, కొత్తగూడెం :** పోలీస్ శాఖలో విధులు నిర్వర్తించి పదవీ విరమణ పొందిన ఏఎస్సై సదయ్య ను శుక్రవారం కొత్తగూడెం జిల్లా ఎస్పీ రోహిత్ రాజు ఐపీఎస్ తన కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. డీసీఆర్బీలో ఏఎస్సైగా విధులు నిర్వర్తిస్తున్న గండి సదయ్య మే 31తో తన సర్వీస్ ను ముగించుకొని ఉద్యోగ విరమణ పొందడం జరిగింది. గత 40 సంవత్సరాలుగా క్రమశిక్షణతో పోలీస్ శాఖలో పనిచేస్తూ ప్రజలకు సేవలు అందించిన ఈ అధికారిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. ఉద్యోగ విరమణ అనంతరం ప్రభుత్వం నుంచి వారికి అందాల్సిన అన్ని రకాల ప్రతిఫలాలను త్వరితగతిన అందేలా చర్యలు చేపట్టాలని జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులకు సూచించారు. అనంతరం వారి కుటుంబ ప్రస్తుత స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. తమ శేష జీవితాన్ని కుటుంబ సభ్యులతో కలిసి సంతోషంగా గడపాలని తెలిపారు. భవిష్యత్తులో ఏ విధమైన సహాయం కావాలన్నా వెంటనే తమను సంప్రదించాలని వారికి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ ఇన్ స్పెక్టర్ నాగరాజు, వెల్ఫేర్ ఆర్ఐ కృష్ణారావు, జిల్లా పోలీసు అధికారుల సంఘం అధ్యక్షులు శ్రీనివాసరావు, సభ్యులు శ్రీనివాసరావు, జానీ, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. విరమణ ఉద్యోగానికే కానీ, సేవకు కాదని సీనియర్ జర్నలిస్టు, వరంగల్ వాయిస్ ఎడిటర్ గడ్డం కేశవమూర్తి అభిప్రాయపడ్డారు. ఏఎస్సై గండి సదయ్య తన శేష జీవితాన్ని సమాజ హితానికి ఉపయోగించాలని ఆయన ఆకాంక్షించారు. అలాగే, ఉద్యోగ విరమణ పొందిన గండి సదయ్య శేష జీవితం మధురాంతకం కావాలని ఈయన బంధుమిత్రులు పూజారి సాంబయ్య, తాటికొండ వీరస్వామి, పూజారి విజయ్, శ్రీనివాస్, పూజారి రాజయ్య తదితరులు ఆకాంక్షించారు.



## బడీడు పిల్లలను పాఠశాలలో చేర్పించండి



**వరంగల్ వాయిస్, పరకాల :** ఐదేళ్లు నిండిన ప్రతి పిల్లవాడు పాఠశాలలో చేరేలా చర్యలు తీసుకోవాలి మండల పరిషత్ అభివృద్ధి అధికారి పెద్ది ఆంజనేయులు అన్నారు. పిల్లలు ఇంట్లో ఉండకుండా బడిలో చేర్పించే విధంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టాలని కోరారు. బడిబాట కార్యక్రమంలో భాగంగా శనివారం మండల విద్యాశాఖ అధికారి రమాదేవి అధ్యక్షతన ఉపాధ్యాయులు, గ్రామైఖ్య సంఘం అధ్యక్షులు, అంగన్వాడీ టీచర్లకు ఏర్పాటు చేసిన అవగాహన సమావేశానికి హాజరై మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ద్వారా మరుగుదొడ్లు, మంచి నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, మైనర్ రిపేర్ చేసి పేయింటింగ్ తో సహా అన్ని వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉదయం టిఫిన్, మధ్యాహ్నం భోజనం, ఏకరూప దుస్తులు, పుస్తకాలు, నోటుబుక్కులు ఉచితంగా పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఈ విషయం పట్ల తల్లిదండ్రులకు అవగాహన కల్పించి పాఠశాలలో విద్యార్థుల సంఖ్య పెంచాలని సూచించారు. మండల విద్యాశాఖ అధికారి రమాదేవి మాట్లాడుతూ ఈ నెల 3 నుంచి అన్ని గ్రామాలలో ఉపాధ్యాయులు, అంగన్వాడీ టీచర్లు, వీఓఏలు టీం లాగా వెళ్లి ప్రతి రోజూ సాయంత్రం వరకు రిపోర్ట్ పంపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు ఏవీ భాస్కర్, ఎస్ఐ, ఏపీఎం, ఐసీడీఎస్ సూపర్వైజర్, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, వీఓఏలు పాల్గొన్నారు.

## ఏఐఎస్‌బీ వార్షికోత్సవ పోస్టర్ ఆవిష్కరణ




**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాకతీయ యూనివర్సిటీ సెకండ్ గేట్ వద్ద ఏఐఎస్‌బీ వార్షికోత్సవాల పోస్టర్లను ఏఐఎస్‌బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ ఆవిష్కరించారు. జూన్ 25న జరిగే అఖిల భారత విద్యార్థి బ్లాక్ ఏఐఎస్ బీ 74వ వార్షికోత్సవాల పురస్కరించుకొని కాకతీయ విశ్వవిద్యాలయం సెకండ్ గేట్ వద్ద ఏఐఎస్ బీ 74వ వార్షికోత్సవాల పోస్టర్ల ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏఐఎస్ బీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి హకీమ్ నవీద్ పాల్గొని వార్షికోత్సవాల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హకీమ్ నవీద్ మాట్లాడుతూ ఏఐఎస్ బీ 1951లో పశ్చిమబెంగాల్ రాష్ట్రంలో ఏర్పడి నేతాజీ సుభాష్ చంద్రబోస్ ఆశయాల సాధనకై కుల, మత, ప్రాంతాలకు అతీతంగా సోషలిజం సాధనకై నేతాజీ కలలు కన్నా భారత దేశ పునర్నిర్మాణం కోసం దేశవ్యాప్తంగా ఉద్యమిస్తుందన్నారు. రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విద్యా వ్యతిరేక విధానాలపై ప్రభుత్వ విద్యా సంస్థల యూనివర్సిటీల పరిరక్షణకై విద్యా కార్పొరేటీకరణకు వ్యతిరేకంగా గత 73వ సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతుందని ఆయన కొనియాడారు. రాష్ట్రవ్యాప్తంగా 74 వ వార్షికోత్సవాలను ఏఐఎస్ బీ శ్రేణులు ఘనంగా నిర్వహించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి జిల్లా నాయకులు మోహన్, ప్రవీణ్, యాసీన్, అఖిల్, సిరాజ్ తదితరులు పాల్గొన్నారు.

# అనాథ పిల్లలకు అనితారెడ్డి చేయూత



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** అనురాగ్ హెల్పింగ్ సొసైటీ ఆధ్వర్యంలో హృదయ స్పందన హెూప్ సొసైటీ స్వచ్ఛంద సంస్థ నిర్వహించే 'షాపింగ్ ఫర్ పూర్' కార్యక్రమానికి అనురాగ్ సేవా సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ కె.అనిత రెడ్డి చేయూతనందించారు. హనుమకొండ బాలసముద్రంలోని తన నివాసంలో హృదయ స్పందన సొసైటీ నిర్వాహకులు పెండెం రాజేశ్వరికి, వారి దగ్గర పేద, అనాధ పిల్లల చదువుకు అవసరమయ్యే లాంగ్ నోట్ బుక్స్, స్టేషనరీ ఐటమ్స్, వృద్ధులకు దుప్పట్లు ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా అనురాగ్ సొసైటీ అధ్యక్షురాలు డాక్టర్ అనిత రెడ్డి మాట్లాడుతూ షాపింగ్ ఫర్ పూర్ ద్వారా అమ్మ నాన్న లేనిపిల్లలు, ఒంటరి పిల్లలకు అవసరమైన వస్తువులను, పిల్లల చదువులకు అవసరమయ్యే నోట్ బుక్స్ ను అందించడం, వృద్ధులకు దుప్పట్లు అందించడం చాలా సంతృప్తిని అందించిందని, సంతోషంగా ఉందని తెలిపారు. అనురాగ్ సొసైటీ ద్వారా ఎన్నో సంవత్సరాలుగా ఈ కార్యక్రమం నిర్వహించినట్లు ఆమె తెలిపారు. పేద పిల్లలకు, అనాథ పిల్లలకు అవసరమయ్యే వస్తువులను స్వచ్ఛంద సంస్థల ద్వారా అందించాలని, విద్యాదానం మహాదానం అని పేద, అనాథ పిల్లలకు చేయూతనందించడానికి ముందుకు రావాలని కోరారు. ఒకరిని చదివిస్తే ఆ కుటుంబాన్ని వృద్ధి చేసినట్లేనని డాక్టర్ అనితా రెడ్డి అన్నారు. ఈ కార్యక్రమంలో హృదయ స్పందన హెూప్ సేవా సొసైటీ అధ్యక్షులు పెండెం శివానంద్, గొడిశాల అనిల్ పాల్గొన్నారు.

# గెస్ట్ ఫ్యాకల్టీని వెంటనే విధుల్లోకి తీసుకోవాలి

## గుగులోతు భీమా నాయక్



**వరంగల్ వాయిస్, మహబూబాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో 2024-25 విద్యా సంవత్సరం ప్రారంభమవుతున్న వేళ గురుకులాల్లో పార్ట్ టైం పనిచేస్తూ, 64.19 శాతంపైగా ప్రతిభ కనబరిచిన జూనియర్ లెక్చరర్లను విధుల్లోకి తీసుకోవాలనీ గురుకులాల కార్యదర్శి సర్కులర్ జారీ చేశారు. ఇటీవల మార్చిలో జరిగిన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షల్లో మంచి పనితీరు కనబరిచిన పార్ట్ టైం జూనియర్ లెక్చరర్ల సేవలను పునరుద్ధరించాలని ప్రభుత్వం సర్కులర్ జారీ చేసినప్పటికీ, కొంత మంది గురుకులాల ప్రిన్సిపల్స్ విధుల్లోకి చేర్చుకోకుండా, జూనియర్ లెక్చరర్లను ఇబ్బంది పెడుతున్నారని, తక్షణమే వారిని విధిలోకి చేర్చుకోవాలని లంబాడి హక్కుల పోరాట సంఘం ఎల్ హెచ్ పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గుగులోతు భీమా నాయక్ డిమాండ్ చేశారు. ఎవరైతే కాసులకు కక్కుర్తి పడి, మాకు ఇంకా ప్రిన్సిపల్ సెక్రెటరీ నుంచి, ఆర్ సీఓ నుంచి ఆర్డర్లు రాలేదని, జూనియర్ లెక్చరర్లను ఇబ్బంది పెడుతున్నారని, అలాంటి వారిని గుర్తించి సర్వీస్ నుంచి రిమూవ్ చేయాలని భీమా నాయక్ అన్నారు. చాలీచాలని జీతాలతో జూనియర్ లెక్చరర్లు పనిచేస్తూ, పూట గడుపుతూ, విద్యార్థులకు నాణ్యమైన విద్యను సేవలు అందిస్తున్న, కనీసం జాలి దయ లేకుండా జూనియర్ లెక్చరర్లను ఆటంకపరుస్తున్న ప్రిన్సిపాళ్లను వదిలిపెట్టే ప్రసక్తే లేదన్నారు. తక్షణమే రీజనల్ కోఆర్డినేటర్ ఆఫీసర్ ఆర్ సీఓ ఈ విషయంపై స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. జూనియర్ లెక్చరర్ల తరఫున లంబాడి హక్కుల పోరాట సంఘం అండగా ఉంటుందని తెలిపారు. సమస్యను పరిష్కరించకుంటే గురుకులాల కార్యదర్శిని కలిసి అవినీతి అక్రమాలు చేస్తున్న ప్రిన్సిపాళ్లపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రాలు ఇస్తామని, అవసరమైతే ముట్టడి చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పీఎస్ నేతలు రాందాస్ నాయక్, డీఎస్ బాలునాయక్, మహిళా విభాగం రాష్ట్ర నాయకురాలు స్వప్న బాయి, శ్రీను నాయక్, శివ వర్మ నాయక్, వీరన్న నాయక్ పాల్గొన్నారు.

## ఘనంగా హనుమాన్ జయంతి



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని అతి ప్రసిద్ధిగాంచిన 20వ డివిజన్ లో శనివారం హనుమాన్ జయంతి సందర్భాన్ని పురస్కరించుకొని రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అత్యంత వైభోపేతంగా పంచామృతాలతో తెల్లవారుజామున నాలుగు గంటలకు అభిషేకాన్ని నిర్వహించారు. హనుమాన్ ప్రీతికరమైన ఆకు పూజ, వడపూజ ఘనంగా చేశారు. ఈ సందర్భంగా హనుమాన్ చాలీసా పారాయణం కూడా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రంగనాథ స్వామి దేవాలయం అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు వంగరి రవి, ప్రధాన కార్యదర్శి చిలుపూరి సురేష్, కోశాధికారి సుల్తానా సమ్మక్క, ఆలయ ప్రధాన అర్చకులు ఆరుట్ల కృష్ణమాచార్యులు, ఆలయ కమిటీ సభ్యులు మోటం శ్రీనివాస్, విరాట్ ప్రకాశ్ రెడ్డి, వంగరి సమ్మయ్య, రాగుల ప్రసాద్, నీలం శ్రీనివాస్, ఉపాధ్యక్షురాలు కూరపాటి రోజా, కోల కవిత, మంచాల శ్రీనివాస్, సుజన, కూరపాటి రవికుమార్, గడ్డం భాస్కర్, హనుమాన్ భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## మహా అన్నదానం..



కాశిబుగ్గ వివేకానంద కాలనీ ఆర్చి నెంబర్ 2లో హనుమాన్ జయంతి సందర్భంగా కోతి విగ్రహం వద్ద ఘనంగా అభిషేకం నిర్వహించి 1500 మందికి అన్నదానం కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో 19వ డివిజన్ కార్పొరేటర్ ఓని స్వర్ణలత భాస్కర్, 20వ కార్పొరేటర్ గుండేటి నరేందర్ కుమార్, ధూపం సంపత్, గుల్లపల్లి రాజకుమార్, చిలువేరు శ్రీనివాస్, కురవి పరమేష్, కత్తెరశాల భరత్, క్యాతం రంజిత్, వేముల నాగరాజు, బొప్పరాతి నగేష్, వంగరి రాంప్రసాద్, బాలమోహన్ రాజ్, చిలువేరు పవన్, బానోతు కిరణ్ నాయక్, గణిపాక సుధాకర్, చిలువేరు రాజు, గుజ్జుల రాకేష్ రెడ్డి, పత్రి సుభాష్, గుండ రవికుమార్, చిలువేరు థామస్, నాశనం హరీష్, పెండ్యాల సోను, జక్కి యుగేందర్, కేతన్ రవీందర్, తొగరు వినయ్, చెన్నూరి కిషోర్, చిలువేరు సన్నీ, కలివేలు శేషు, కుసుమ సారంగపాణి, తోట బాలరాజు, దేవర ప్రసాద్ పాల్గొన్నారు.

## లక్ష్మీబాయికి ఎంపీ వద్దిరాజు ఘన నివాళి



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** కేంద్ర మాజీ మంత్రి, స్వర్గీయ పుంజాల శివశంకర్ ధర్మపత్ని, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ వినయ్ కుమార్ మాతృమూర్తి లక్ష్మీబాయి మృతి తీవ్ర బాధాకరం అని రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర అన్నారు. ఎంపీ రవిచంద్ర శనివారం మధ్యాహ్నం రంగారెడ్డి జిల్లా మామిడిపల్లిలోని వినయ్ కుమార్ నివాసానికి వెళ్లి లక్ష్మీబాయి చిత్రపటానికి పూలుజల్లి ఘనంగా నివాళులర్పించారు. వినయ్ కుమార్ ను, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లక్ష్మీబాయి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతున్ని ప్రార్థించారు. అలాగే, ఎంపీ వద్దిరాజు సన్నిహితులు మరికల్ పోత సుధీర్ కుమార్, మరిశెట్టి రాఘవయ్య, ఆది విష్ణుమూర్తి, కూసం శ్రీనివాసులు, గుండ్లపల్లి శేషగిరిరావు, వేం రామచంద్రారెడ్డి, జెన్నాయికోడే జగన్మోహన్ తదితరులు లక్ష్మీబాయి చిత్రపటానికి పూలు జల్లి ఘనంగా శ్రద్ధాంజలి ఘటించారు.

## డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్



**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** మే 30న హైదరాబాద్ సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన డీబీఎఫ్ రాష్ట్ర నాలుగవ మహాసభలలో డీబీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా చుంచు రాజేందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా చుంచు రాజేందర్ మాట్లాడుతూ డీబీఎఫ్ లో గత 20 సంవత్సరాలుగా పనిచేస్తూ దళిత, గిరిజన కుటుంబాల సమగ్ర అభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రవేశపెడుతున్న సంక్షేమ ఫలాలు అణగారిన కుటుంబాలకు అందేలా కృషి చేస్తూ, బాబా సాహెబ్ అంబేద్కర్ అందించిన ఉద్యమ స్ఫూర్తితో కార్యకర్తలను ఉద్యమం వైపు నడిపిస్తూ మహనీయుల ఆలోచన విధానంతో పనిచేయడం జరుగుతుందన్నారు. డీబీఎఫ్ లో గ్రామ స్థాయి నుంచి మండల స్థాయి, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడిగా, భూమి, ఉపాధి హక్కుల రాష్ట్ర కన్వీనర్‌గా, రాష్ట్ర కార్యదర్శిగా పనిచేస్తూ ప్రజలకు, ప్రభుత్వాలకు వారధిగా పనిచేయడం గర్వకారణమని తెలిపారు. తనకు పదవీ రావడానికి సహకరించిన డీబీఎఫ్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు కొరివి వినయ్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం బాగ్యరావు, జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర అధ్యక్షుడు రమేష్ కు, రాష్ట్ర జిల్లా స్థాయి, ఉద్యమ సహచరులకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

## నకిలీ విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు

### పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి



**వరంగల్ వాయిస్, తొర్రూరు :** పెద్దవంగర, తొర్రూరు మండల కేంద్రాలలో పలు గ్రోమోర్ ఎరువుల సెంటర్లను పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని ఝాన్సీ రెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రోమోర్ సెంటర్ లోని పత్తి విత్తనాలు, పలు రికార్డులను పరిశీలించిన అనంతరం, రైతులకు నాణ్యమైన పత్తి విత్తనాలను అందుబాటులో ఉంచాలని, గ్రోమోర్ సెంటర్ నిర్వాహకులకు సూచించారు. గ్రోమోర్ సెంటర్, ఫర్టిలైజర్ షాపులలో నకిలీ విత్తనాలు అమ్మినట్లు తెలిస్తే షాపులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వరికి సరిపడే ఎరువులను కూడా అందుబాటులో ఉంచే విధంగా చర్యలు చేపట్టాలని, రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని ఎమ్మెల్యే యశస్విని రెడ్డి సూచించారు. ఎమ్మెల్యే వెంట నియోజకవర్గ ప్రజాప్రతినిధులు, మండల ప్రజాప్రతినిధులు, పార్టీ సీనియర్ నాయకులు, యూత్ నాయకులు, తదితరులు, పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కను కలిసిన మార్నేని



**వరంగల్ వాయిస్, వర్ధన్నపేట :** హైదరాబాద్‌లో పంచాయతీరాజ్, గ్రామీణ అభివృద్ధి శాఖ మంత్రి ధనసరి సీతక్కను వారి స్వగృహంలో ఉమ్మడి వరంగల్ జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ చైర్మన్ మార్నేని రవీందర్ రావు శనివారం మర్యాద పూర్వకంగ కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పుష్పగుచ్ఛంతో పాటు బ్యాంకు మెమొంటో అందజేసి ప్రభుత్వ డిపాజిట్లు సహకార బ్యాంకులలో చేయాలని కోరారు.

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి

### ట్రాఫిక్ సీఐ కె.శ్రీధర్



**వరంగల్ వాయిస్, కాశిబుగ్గ :** వరంగల్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు డ్రంకెన్ డ్రైవ్ లో గానీ, డ్రైవింగ్ లైసెన్స్ కేసు గానీ, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో మీ వాహనం సీజ్ చేయబడితే ఈ నెల 3 నుంచి 8 వరకు వరంగల్ సెకండ్ క్లాస్ కోర్టులో లోక్ అదాలత్ కు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయబడునని వరంగల్ ట్రాఫిక్ సీఐ కె. శ్రీధర్ తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు, వారి ఆధార్ కార్డ్ జిరాక్స్, వెహికల్ డాకుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్సు కేసులు ఉన్నవారు, ఆధార్ కార్డ్ మరియు మీసేవలో లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు తీసుకుని రావాలన్నారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించిన కేసులు ఉన్నవారు బర్త్ సర్టిఫికెట్, లేక ఎస్సెస్సీ మెమో మొదలైనవి తీసుకుని రావాలని పేర్కొన్నారు. ఈ లోక్ దాలత్ లో తక్కువ జరిమానా తో క్లోజ్ చేసుకోవచ్చని, కాబట్టి ఈ అవకాశాన్ని కేసు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని వరంగల్ ట్రాఫిక్ కె. శ్రీధర్ కోరారు.

## 3 నుంచి లోక్ అదాలత్

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** కాజీపేట్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రజలు డ్రంకెన్ డ్రైవ్ లో గాని, డ్రైవింగ్ లైసెన్స్ కేసు గానీ, మైనర్ డ్రైవింగ్ కేసుల్లో మీ వాహనం సీజ్ చేయబడితే ఈ నెల 3 నుంచి 8 వరకు హనుమకొండ సెకండ్ క్లాస్ కోర్టుల్లో "లోక్ అదాలత్" లో కోర్టుకు హాజరైనట్లయితే ఆ కేసును పూర్తిగా క్లోజ్ చేయబడునని కాజీపేట్ ట్రాఫిక్ సీఐ పి.నాగబాబు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులు ఉన్నవారు, వారి ఆధార్ కార్డ్ జిరాక్స్, వెహికల్ డాకుమెంట్స్, డ్రైవింగ్ లైసెన్సు కేసులు ఉన్నవారు, ఆధార్ కార్డ్, మీ సేవ లో లైసెన్సు కోసం దరఖాస్తు చేసుకున్న రశీదు తీసుకు రావాలన్నారు. మైనర్ డ్రైవింగ్ కేసులకు సంబంధించిన కేసులు ఉన్నవారు, బర్త్ సర్టిఫికెట్, లేక ఎస్సెస్సీ మెమో మొదలైనవి తీసుకుని రావాలని తెలిపారు. ఈ "లోక్ దాలత్"లో తక్కువ జరిమానాతో క్లోజ్ చేసుకోవచ్చన్నారు. కాబట్టి, ఈ అవకాశాన్ని కేసు ఉన్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## విత్తన, ఎరువుల షాపుల తనిఖీ



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** మండల కేంద్రంలోని టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో శనివారం ఎనిమిది విత్తనాల, ఎరువుల షాపులను తనిఖీ చేయడం జరిగింది. ప్రతి ఒక్క షాపులో పత్తి విత్తన ప్యాకెట్లు, లైసెన్స్, స్టాక్ రిజిస్టర్, రైతు రిజిస్టర్, ఇన్ వాయిస్, బిల్ బుక్స్, సోర్స్ సర్టిఫికెట్ మొదలగు వాటిని పరిశీలించారు. విత్తనాలను ఎమ్మార్పీకి మించి అమ్మ రాదని ఆదేశించారు. అదేవిధంగా ఇక్కడ కలిసిన రైతులకు లూస్ విత్తనాలు కొనుగోలు చేయరాదని, తప్పనిసరిగా కొనుగొలు చేసిన విత్తనాలకు రశీదు తీసుకోవాలని రైతులకు చెప్పారు. అదే విధంగా అన్ని రకాలు కూడా ఇంచుమించుగా ఒకే రకమైన దిగుబడి ఇస్తాయని తెలియజేశారు. షాప్ డీలర్లు బ్లాక్ మార్కెటింగ్, నకిలీ విత్తనాలు అంట కట్టినట్లయితే పీడీ యాక్ట్ నమోదు చేయటం జరుగుతుందని హెచ్చరించారు. ఈ బృందంలో తహసీల్దార్ యుగంధర్, ఎస్ హెచ్ఓ నరేష్, ఎంఏఓ కాకి శ్రీనివాస్ రెడ్డి పాల్గొన్నారు.

## హనుమాన్ జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే నాయిని



**వరంగల్ వాయిస్, కాజీపేట :** పట్టణంలోని 62వ డివిజన్ సోమిడిలో శ్రీ భక్తాంజనేయ రాధాకృష్ణ స్వామి, 63వ డివిజన్ జూబ్లీ మార్కెట్ శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయంలో హనుమాన్ జయంతి సందర్భంగా ఘనంగా నిర్వహించిన విశిష్ట పూజా కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసనసభ్యుడు నాయిని రాజేందర్ రెడ్డి, 62వ డివిజన్ కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, కార్పొరేటర్ మాట్లాడుతూ బలం, అసమానమైన భక్తి, నిస్వార్థసేవకు ప్రతీక అయిన ఆంజనేయుడు మీకు బలాన్ని ఇవ్వాలని, రామభక్త ఆంజనేయుని శుభాశీస్సులతో ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, సిరిసంపదలతో, ఆనందంగాజీవించాలని ఆస్వామి వారిని ప్రార్థించారు. అనంతరం ప్రజలందరికీ, శ్రేయోభిలాషులకు, హనుమాన్ జయంతి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో 63వ డివిజన్ కార్పొరేటర్ విజయశ్రీ రజాలి, మాజీ కార్పొరేటర్లు సుంచు అశోక్, గుంటి కుమార్, ఎండీ అంకూష్, డివిజన్ అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఆంజనేయ స్వాములు, కాంగ్రెస్ పార్టీ సైనికులు, భక్తులు స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా హనుమాన్ జయంతి వేడుకలు



**వరంగల్ వాయిస్, రఘునాథపల్లి :** హనుమాన్ జయంతి సందర్భంగా రఘునాథపల్లి మండలం కంచనపల్లి గ్రామంలో శనివారం హనుమాన్ దీక్ష భక్తులు ప్రజలు పెద్ద ఎత్తున హనుమాన్ గుడి వద్ద ప్రత్యేక పూజలు ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు స్వామి వారికి నైవేద్యం సమర్పిస్తారు. హనుమాన్ భక్తులు ఇరుముడి కట్టుకొని కొండగట్టుకు వెళ్లారు. మరి కొంతమంది జై హనుమాన్ జై జై హనుమాన్ అంటూ గ్రామంలో వాడవాడలో తిరిగారు. ఈ సందర్భంగా ప్రజలకు పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఆలయ ప్రధాన పూజారి ఉపేందర్ శర్మ, స్వాములు నాగులగోని నాగేశ్వరరావు, సూర్య ప్రకాష్, కమిటీ గౌరవ అధ్యక్షుడు కిషన్ రావు, ప్రముఖ డాక్టర్ పోస్ట్ మాన్ రంగోజు ఈశ్వరయ్య, ప్రదీప్ కుమార్, మహేందర్, ఐలయ్య, మేకల శ్రీను, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ పనులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలి

### భూపాలపల్లి కలెక్టర్ భవేశ్ మిశ్రా



**వరంగల్ వాయిస్, భూపాలపల్లి :** ప్రభుత్వ పాఠశాలలు ఆధునికతను సంతరించుకొని ఆహ్లాదకరంగా తయారు చేసేందుకు చేపట్టిన మరమ్మత్తు పనులను సకాలంలో పూర్తి చేయుటకు చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. శనివారం జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్, ఎంపీడీఓతో కలిసి మహాదేవపూర్ మండల కేంద్రంలో విస్తృతంగా పర్యటించి పాఠశాలల్లో జరుగుతున్న మరమ్మత్తు పనుల పురోగతిని పరిశీలించారు. ఎల్కేశ్వరం గ్రామంలోని ఎంపీపీఎస్ పాఠశాలలో రూ.3.85 లక్షలు, మండల పరిషత్ పాఠశాలలో రూ.3.94 లక్షలతో చేపట్టిన మరమ్మతులను, బొమ్మాపూర్ గ్రామంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో రూ.4.55 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనులను, మహదేవపూర్ కేజీబీవీ పాఠశాలలో రూ.3.20 లక్షలతో చేపట్టిన పనులను తనిఖీ చేశారు. కేజీబీవీల్లో బాలికల రక్షణ కోసం చుట్టూ ప్రహరి గోడ నిర్మాణం ఆగస్టు 15 వరకు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని పంచాయతీ రాజ్, ఇంజినీరింగ్, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా పనులు చేపట్టిన గ్రామ సమాఖ్యలతో మాట్లాడుతూ ఆయా పాఠశాలల్లో చేపట్టిన పనులను జూన్ 20 వరకు పూర్తిచేయాలని ఆదేశించారు. చేపట్టిన మరమ్మత్తు పనులకు అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు అందచేయాలని అన్నారు. పాఠశాలల్లో మంచినీరు, విద్యుత్, మరుగుదొడ్లు, హ్యాండ్ వాష్ లేని పాఠశాలలు ఉండొద్దని అన్నారు. పాఠశాలలు పున:ప్రారంభానికి ముందు పూర్తిస్థాయిలో చేపట్టిన పనులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని వీఓలను ఆదేశించారు. ఇంజినీరింగ్ అధికారులు పనుల్లో వేగం పెంచడంతో



పాటు నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ త్వరితగతిన పనులు పూర్తి అయ్యేలా చొరవ చూపాలన్నారు. పనుల్లో ఆలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అనంతరం మహాదేవపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో పాఠశాలల్లో జరుగుతున్న పనుల పురోగతిని పనులు పూర్తిచేసే గడువును మండలంలోని ఆయా పాఠశాలల హెడ్ మాస్టర్లు, కాంట్రాక్టు పనులు చేపట్టిన వీవోలతో సమీక్ష నిర్వహించారు. మహాదేవపూర్ మండలంలో మొత్తం 26 ప్రభుత్వ పాఠశాలల్లో 3 జడ్పీహెచ్ ఎస్, ఒక కేజీబీవీ ఉండగా 26 పాఠశాలల్లో ఒక కోటి నాలుగు లక్షల రూపాయలతో మరమ్మత్తు పనులు చేపట్టినట్లు తెలిపారు. పెండింగులో ఉన్న పనులను వేగవంతం చేసి యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని, పాఠశాలలు ప్రారంభం అయ్యే నాటికి రెండు రోజుల ముందే పనులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. వచ్చే ఆగస్టు15 వరకు జిల్లాలోని అన్ని పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు ఏర్పాటు చేసి రాష్ట్రంలోనే ఆదర్శ జిల్లాగా పేరుపొందేలా పాఠశాలలను తయారు చేయాలని పేర్కొన్నారు. పాఠశాలలు తనిఖీకి సెంట్రల్ టీం ఎప్పుడు వచ్చినా పిల్లలకు అన్ని వసతులను ఏర్పాటు చేశామని గర్వంగా చెప్పుకునేలా ఉండాలని కలెక్టర్ అన్నారు. అదనంగా పాఠశాలల్లో తరగతి గదులు కానీ, కిచెన్ షెడ్స్ కానీ, ఇతరత్రా ఏ పని అయిన సెకండ్ ఫేస్ లో కవర్ చేస్తామని అన్నారు. అంతకుముందు రెండు పాఠశాలల్లో స్వయం సహాయక మహిళా సంఘాల ద్వారా కుట్టించిన స్కూలు యూనిఫామ్స్ ధరించి చిన్నారులు జిల్లా కలెక్టర్ కు పూలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్డీఓ నరేష్, డీఈఓ రాంకుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, పంచాయతీ రాజ్ డీఈ సాయిలు, ఏఈ రవీందర్, పాఠశాలల హెడ్ మాస్టర్లు, వీఓలు తదితరులు పాల్గొన్నారు.

# మహిళల హక్కులే మానవ హక్కులు

### సమగ్ర అభివృద్ధికి సమాన అవకాశాలు కల్పించాలి

### భారత జాతీయ మహిళా సమాఖ్య నేత నేదునూరి జ్యోతి



**వరంగల్ వాయిస్, రంగారెడ్డి :** సమాజంలో మహిళలకు సమాన హక్కులు సమాన అవకాశాలు ఆర్థిక రాజకీయ సాంఘిక రంగాలలో కల్పించినప్పుడే సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని భారత జాతీయ మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా మహిళా సమాఖ్య జిల్లా కౌన్సిల్ సమావేశం శనివారం రాజేంద్రనగర్ లోని మహిళా సమాఖ్య కార్యాలయంలో రంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలు పోచమోని నీలమ్మ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న మహిళా సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేదునూరి జ్యోతి మహిళా సమాఖ్య 70వ వార్షికోత్సవ సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసి మాట్లాడుతూ భారత జాతీయ మహిళా సమాఖ్య 70 సంవత్సరాలుగా మహిళల అభ్యున్నతికి అభివృద్ధికి సమానత్వానికి హింస లేని సమాజానికై అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తుందని ఎంతోమంది త్యాగధనుల ఫలితంగా ఎన్నో విజయాలను సాధించిన ఘనత మహిళా సమాఖ్యది అని మహిళా రిజర్వేషన్ బిల్లు మహిళా అత్యాచార నిరోధక చట్టాలు, మహిళలకు ఉచిత విద్య, వైద్యం కోసం అంతరాలు లేని సమాజానికై నిరంతరం ఉద్యమాలను పోరాటాల నిర్వహిస్తుందని, రాజ్యాంగ పరిరక్షణకై అనేక ఉద్యమాలు నిర్వహిస్తుందన్నారు. దేశానికి స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడుస్తున్నప్పటికీ మహిళల అభివృద్ధి ఆమడ దూరంలో నిలిచి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళను అణిచివేసి దోపిడీ పీడనకు గురిచేసి అంగడి సరుకుగా మార్చిన పెట్టుబడిదారీ వ్యవస్థకు గోరి కట్టి, సమ సమాజ వ్యవస్థ నిర్మాణంలో మహిళలు భాగస్వాములు కావాలని 70వ వార్షికోత్సవ సందర్భంగా పిలుపునిచ్చారు. రాజకీయ సమానత్వం సాధించినప్పుడే వివక్షతలు దోపిడీ పీడన నుంచి మహిళలకు విముక్తి కలుగుతుందని, అందుకు మహిళలు క్రియాశీల పోరాటాలలో భాగస్వాములు కావాలని నేదునూరి జ్యోతి కోరారు. మహిళల అభివృద్ధికి వికసిత భారత పేరుతో బేటి పడావో బేటి బచావో లాంటి అందమైన నినాదాలు ఇస్తున్నారు తప్ప, ఆర్థికంగా నిలదొక్కుకోవడానికి కావలసినటువంటి భూమిలో వాటా, పరిశ్రమలలో వాటా, ఉద్యోగాలలో వాటా, సంపదలో వాటా మాత్రం ఇవ్వడానికి ముందుకు రావడం లేదని తీవ్రంగా విమర్శించారు. ప్రజా పాలన పేరుతో ప్రజల నుంచి సేకరించిన పత్రాలను వెల్లడి చేయాలని మహిళలకు విద్య ఉపాధి అవకాశాలు పరిశ్రమలలో భాగస్వామ్యం కల్పించాలని డిమాండ్ చేశారు. మహిళలు ఎదుర్కొంటున్నటువంటి సమస్యల మీద నిరంతరం పోరాటాలు కొనసాగించాలని, బూటకపు వాగ్దానాలతోటి డబ్బు, మద్యం, ప్రాంతాల పేరుతో దైవం, కులమతాల పేరుతో ఎన్నికల్లో తాత్కాలికంగా పెట్టుబడిదారి వర్గం గెలుస్తుందని, అంతిమంగా దోపిడికి గురి అవుతున్నటువంటి 50 శాతంగా ఉన్న మహిళలోకం 99 శాతంగా ఉన్న కార్మిక వర్గం ఐక్య పోరాటాలు నిర్వహించి ప్రజా ప్రభుత్వాలను సాధించుకుంటారని పిలుపునిచ్చారు. జూన్ 4న ఎన్ఎఫ్ఐ భారత జాతీయ మహిళా సమాఖ్య ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని శ్రేణులకు పిలుపునిచ్చారు. మహిళా సమాఖ్య రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళలకు ఇచ్చిన వాగ్దానాలు నిలబెట్టుకోవాలన్నారు. ఆడపిల్లలకు ఉచిత విద్య వైద్యం అందించాలని, నియంత్రించాలని, అర్హులైన పేదలకు డబుల్ బెడ్ రూమ్ లు కట్టించాలని, స్థానిక సంస్థల ఎన్నికలలో మహిళలకు 50 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కమలమ్మ, మంజుల, కన్నగాని లక్ష్మి, వెంకటమ్మ, శ్యామ్, విజయలక్ష్మి, షామీం, సువర్ణ, ఎల్లమ్మ, రమాదేవి, సుమత, లలిత తదితరులు పాల్గొన్నారు.

# కాకతీయ కళాతోరణాన్ని తొలగిస్తే ఊరుకోబోం



**వరంగల్ వాయిస్, కేయూ :** కాకతీయ కళాతోరణాన్ని రాజ ముద్ర నుంచి తొలగించడాన్ని వ్యతిరేకిస్తూ కాకతీయ యూనివర్సిటీ భారత రాష్ట్ర సమితి విద్యార్థి విభాగం బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో శనివారం కేయూ మొదటి గేటు ఎదుట ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మ దహనానికి ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. దీంతో విద్యార్థి నాయకులు ధర్నా చేయడంతో పోలీసులకు బీఆర్ఎస్వీ విద్యార్థులకు మధ్య తోపులాట జరిగింది. ఈ సందర్భంగా బీఆర్ఎస్వీ కేయూ అధ్యక్షుడు బైరపాక ప్రశాంత్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాచర్ల శరత్ చంద్ర మాట్లాడుతూ తెలంగాణ రాజముద్రలో కాకతీయ తోరణం తొలగించడం తెలంగాణ ప్రజలను అవమానించడమేనని, ఈ ప్రాంత శిల్పకళ కళావైభవానికి, సాంప్రదాయాలకు ప్రజా రంజక పాలనకు నిలువెత్తు నిదర్శనం కాకతీయ కళాతోరణమని అన్నారు. కాకతీయ కళా తోరణానికి ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు ఉందని, చరిత్ర తెలియకుండా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇలాంటి దుశ్చర్యలకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇలా చేస్తే ప్రజా ఆగ్రహానికి



గురికాక తప్పదని, కేసీఆర్ మీదున్న ద్వేషంతో అయన ఆనవాళ్లు లేకుండా చేయాలనే అవివేకంతో కాకతీయ తోరణం జోలికి వస్తే ఖబర్ధార్ అని హెచ్చరించారు. కాకతీయ యూనివర్సిటీ వేదికగా సబ్బండ వర్ణాలను ఏకం చేసి తెలంగాణ మలిదశ ఉద్యమం జరిగిందో, అదే తరహాలో ఇదే యూనివర్సిటీ వేదికగా మరో ఉద్యమం చేస్తామన్నారు. కళాతోరణాన్ని తొలగిస్తుంటే వరంగల్ జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు నోరు విప్పకపోవడం సరైన విధానం కాదని, వరంగల్ జిల్లా ప్రజలకు కాకతీయ కళాతోరణంపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. స్పందించకుంటే త్వరలోనే మంత్రులు, ఎమ్మెల్యేల ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్వీ రాష్ట్ర కార్యదర్శి సంగని సూర్య కిరణ్, అర్బన్, రూరల్ కోఆర్డినేటర్స్ గండ్రకోట రాకేష్ యాదవ్, పిల్లల నాగరాజ్, బీఆర్ఎస్వీ రాష్ట్ర నాయకులు కలకోట్ల సుమన్, గొల్లపల్లి వీర స్వామి, అర్షం మధు, బీఆర్ఎస్వీ నాయకులు పస్తం అనిల్, కళ్యాణ్, చిర్రా ప్రకాష్, రాకేష్, సేహిత్, ముజయితిన్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సోనియమ్మ సమక్షంలో ఆవిర్భావ దినోత్సవం

### డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ



**వరంగల్ వాయిస్, హనుమకొండ :** తెలంగాణ ఉద్యమకారుల ఫోరం వరంగల్ ఉమ్మడి జిల్లా చైర్మన్, కాంగ్రెస్ పార్టీ ఎస్సీ డిపార్ట్ మెంట్ చైర్మన్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ వారి కార్యాలయంలో మాట్లాడుతూ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని ప్రతి ఒక్క ఉద్యమకారుడు పండుగలా జరుపుకోవాలని కోరారు. ఎన్నో ప్రాణ త్యాగాలతో సాధించిన ఈ తెలంగాణ ప్రతి ఒక్క ఉద్యమకారుని గొంతుక అని అన్నారు. రేపు జరుపుకోబోయే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలు ప్రతి ఒక్క తెలంగాణ బిడ్డ పండగ వలె జరుపుకోవాలన్నారు. గత ప్రభుత్వం బంగారు తెలంగాణను చేస్తానని పదేళ్లు నమ్మపలికి అప్పుల తెలంగాణను చేసిందని మండిపడ్డారు. ప్రతి ఒక్క బిడ్డ మీద రెండు లక్షల పైబడి అప్పులు వేసిన ఘనత మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ దక్కుతుందని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత మొదటి పండగ తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ పండుగ అని అన్నారు. ఈ పండుగను ప్రతి ఒక్క నాయకుడు, గాయకుడు, ఉద్యమకారుడు డప్పు చేత బట్టి హైదరాబాదులో జరిగే తెలంగాణ ఆవిర్భావ దినోత్సవ సంబరాలకు విచ్చేస్తున్న తెలంగాణ ఇచ్చిన తల్లి సోనియమ్మ స్వాగతం పలకాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సోనియమ్మల ఆధ్వర్యంలో ఈ పండుగను ఘనంగా జరుపుకోవాలని పిలుపునిచ్చారు.

## ఆంజనేయ స్వామికి విశేష పూజలు




**వరంగల్ వాయిస్, తొర్రూరు :** స్థానిక భక్తాంజనేయ స్వామి దేవాలయంలో ఆలయ పూజారి రేణిగుంట్ల శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో స్వామివారికి ఉదయం సుప్రభాత సేవ, ఉదయం 8:30కి ఆంజనేయ స్వామి వారికి వివిధ రకాల పండ్ల రసాలతో, పంచామృతములతో అభిషేకాలు నిర్వహించారు. శనివారం భారీ ఎత్తున హనుమాన్ స్వాములు ఇరుముడి కట్టుకొని కొండగట్టు యాత్రకు బయలుదేరారు. తదుపరి మూలవిరాట్ స్వామివారికి చందనోత్సవం, అష్టోత్తర పుష్పార్చన పత్ర అర్చన స్వామివారికి వడమాలతో, గజలమాలలతో అలంకరించారు. స్వామివారి చతుర్వేద పారాయణం, హనుమాన్ చాలీసా, రామకీర్తనలు పారాయణంతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మధ్యాహ్నం దాతల సహకారంతో అన్నదానం చేశారు. ఈకార్యక్రమంలో హనుమాన్ భక్త మండలి సభ్యులు కల్లూరి నాగేంద్రచారి, గోపారపు నాగేశ్వరరావు, దార నాగ శివప్రసాద్, శ్రీరామ్, రాజమౌళి, దేవరకొండ కృష్ణప్రసాద్, భువనగిరి శంకర్, కల్లూరి ప్రకాష్, ఆమంచి సోమయ్య, ఇటికెల రాధాకృష్ణమాచార్యులు, రాగి శ్రీనివాసచారి, దొడ్డ రఘు, ఆమంచి దయాకర్, మేడవరపుసోమేశ్వర్, సోమయాచారి, పెయింటర్రవి, బొమ్మరబోయిన రాజు బృందం, హనుమాన్ స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

# తెలంగాణ చిహ్నంలో చార్మినార్ తొలగించాల్సిందే

### మేం ఇందుకు ఎప్పుడూ పోరాడుతూనే ఉంటాం
### బీజేపీ జాతీయ కార్యదర్శి బండి సంజయ్



**వరంగల్ వాయిస్, న్యూఢిల్లీ :** తెలంగాణ రాష్ట్ర చిహ్నంలో చార్మినార్‌ను తొలగించాలని అప్పుడు, ఇప్పుడు తమ పార్టీ పోరాడుతూనే ఉందని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, కరీంగనర్ ఎంపీ బండి సంజయ్ కుమార్ అన్నారు. రాష్ట్ర చిహ్నంలో అమరవీరుల స్థూపం ఉండటం మంచిదని, ఈ విషయంపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అందరి అభిప్రాయం తీసుకోవాలని కోరారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా రాష్ట్ర ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. ఢిల్లీ వేదికగా శుక్రవారం బండి సంజయ్ మీడియాతో మాట్లాడుతూ ఉద్యమంలో అసువులు బాసిన అమరులు, ఉద్యమకారులకు ధన్యవాదాలు తెలిపారు. ఏఐసీసీ అగ్రనేత సోనియా గాంధీని తెలంగాణ ఉత్సవాలకు ఆహ్వానించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, బీజేపీ నాయకులకు ఎందుకు ఆహ్వానం ఇవ్వలేదని ప్రశ్నించారు. ఇచ్చిన మాట సోనియా వెనక్కి తీసుకోవడం వల్లే ఆత్మహత్యలు జరిగాయన్నారు. మాజీ సీఎం కేసీఆర్‌ను వెతికి మరి ఆహ్వానం ఇచ్చి ప్రేమ ఒలకబోసిన రేవంత్‌కు, తెలంగాణకు మద్దతిచ్చిన బీజేపీని ఎందుకు వేడుకలకు పిలవడం లేదని నిలదీశారు. సోనియా, కేసీఆర్ ఒకే వేదిక పంచుకునేలా రేవంత్ ఎత్తుగడ వేశారని చెప్పారు. ఫోన్ ట్యాపింగ్‌లో బయటపడేందుకు కేసీఆర్ , కాంగ్రెస్‌ను అన్ని రకాలా లోబరుచుకున్నారని ఆరోపించారు. ఈ కేసు విషయంలో కేసీఆర్‌కు ఎందుకు నోటీసులు ఇవ్వలేదని ప్రశ్నించారు. ఫోన్ ట్యాపింగ్ కేసు విచారణలో అధికారులు కేసీఆర్ పేరు చెప్పారని, మరీ ఎందుకు చర్యలు తీసుకోలేదని నిలదీశారు. కాళేశ్వరం కేసు, ఫోన్ ట్యాపింగ్ పై రేవంత్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని నిలదీశారు. అందుకే ఈ కేసుల దర్యాప్తు సీబీఐకి అప్పగించాలని డిమాండ్ చేశారు. కేంద్రం దర్యాప్తు చేస్తే, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత అరెస్టు ఎలా జరిగిందో చూశారని అన్నారు. ఏఐసీసీకి తెలంగాణ ఒక ఏటీఎంగా మారిందని విమర్శించారు. నీళ్లు, నిధులు, ఉద్యోగాలను నిర్వీర్యం చేసిన మూరు?డు కేసీఆర్ అని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చడం లేదని ప్రశ్నించారు. తెలంగాణలో అందరి బతుకులను కేసీఆర్ నిర్వీర్యం చేశారని బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## జిమ్ పరికరాలకు మరమ్మత్తులు పూర్తి

### బల్దియా అదనపు కమిషనర్ అనిసుర్ రషీద్



**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిమ్ (జిమ్నాసియం) అవకాశాన్ని నగర వాసులు సద్వినియోగం చేసుకోవాలని బల్దియా అదనపు కమిషనర్ అనుసుర్ రషీద్ తెలిపారు. శనివారం బల్దియా ప్రధాన కార్యాలయ ఆవరణలోని ఇండోర్ స్టేడియంలో గల జిమ్ ను శనివారం అదనపు కమిషనర్ క్షేత్రస్థాయిలో సందర్శించి జిమ్ పరికరాల స్థితి గతులను స్టేడియం బాధ్యులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదనపు కమిషనర్ మాట్లాడుతూ కమిషనర్ ఆదేశాల మేరకు జిమ్ లోని పరికరాల తీరును పరిశీలించడం జరుగుతుందని, జిమ్ లోగల పరికరాలు క్రీడాకారులు వినియోగించుకునే క్రమంలో పరికరాలు దెబ్బతినడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తాత్కాలికంగా జిమ్ లోని పరికరాల వినియోగాన్ని నిలిపి వేయడం జరిగిందన్నారు. ఇటీవల బల్దియా సుమారు రూ.50 వేలు వెచ్చించి వాటికి పూర్తిస్థాయిలో మరమ్మత్తులు చేయించడం జరిగిందని తెలిపారు. కాబట్టి, ఇప్పటి నుంచి నగర వాసులు దేహాదారుఢ్యాన్ని పెంపొందించుకోవడానికి వివిధ రకాల వ్యాయామాల నిమిత్తం జిమ్ సౌకర్యాన్ని అందుబాటులోకి తేవడం జరిగిందని, ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చునని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో డీఎఫ్ఓ శంకర్ లింగం, ఎస్ఎఫ్ఓ దయానంద్, కోచ్ శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

## చేనేత కార్మికులు హాజరు కావాలి




**వరంగల్ వాయిస్, శాయంపేట :** చేనేత ఐక్యవేదిక తెలంగాణ కార్యవర్గం సోమవారం శాయంపేట చేనేత సంఘాన్ని సందర్శించనున్నట్లు చేనేత సంఘం మాజీ అధ్యక్షుడు బాసని చంద్రప్రకాష్ తెలిపారు. సంఘం సభ్యులు, పద్మశాలీలు హాజరుకావాలని కోరారు. సంఘం సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. ఈజీఎస్ ద్వారా సభ్యులకు పని కల్పించే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. సంఘంలో పేరుకుపోయిన బకాయిలను విడుదల చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

## శ్రీ బుగులు వెంకటేశ్వర స్వామిని దర్శించుకున్న జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి.రవీందర్ శర్మ



**వరంగల్ వాయిస్, చిల్పూర్ :** శ్రీబుగులు వెంకటేశ్వర స్వామి దేవస్థానం,చిలుపూరు గుట్టలో శనివారం సాయంత్రం 6 గంటలకు జనగామ జిల్లా ప్రిన్సిపల్ జడ్జి డి.రవీందర్ శర్మ సురేఖ దంపతులు స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం తీర్థ ప్రసాదములు స్వీకరించి ఆలయ చరిత్రను తెలుసుకున్నారు. కార్యనిర్వహణాధికారి బి.లక్ష్మీ ప్రసన్న, అర్చకులు బ్రాహ్మణపల్లి రవీందర్ శర్మ, సౌమిత్రి రంగాచార్యులు, కృష్ణమాచార్యులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అందరికీ నచ్చిన గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి

మాస్ కా దాస్ విశ్వక్ సేన్ కథానాయకుడిగా నటించిన చిత్రం గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి. కృష్ణ చైతన్య దర్శకత్వం వహించిన ఈ సినిమాలో నేహా శెట్టి, అంజలి కథానాయికలుగా నటించారు. యువన్ శంకర్ రాజా సంగీతం అందించారు. భారీ అంచనాలతో మే 31వ తేదీన 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' చిత్రం ప్రేక్షకుల ముందుకు వచ్చిన ఈ సినిమాకి అన్ని వర్గాల నుంచి విశేష స్పందన స్పందన వస్తోంది. కథా నేపథ్యం కొత్తగా ఉందని, ఎమోషనల్ సన్నివేశాలు కట్టిపడేశాయని ప్రేక్షకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో తాజాగా ప్రెస్ మీట్ నిర్వహించిన కథానాయకుడు విశ్వక్ సేన్, దర్శకుడు కృష్ణ చైతన్య తమ సంతోషాన్ని పంచుకున్నారు. తఈ సందర్భంగా హీరో విశ్వక్ సేన్ మాట్లాడుతూ.. తెలుగు ప్రేక్షకులు థియేటర్లలో సినిమాలను ఆదరించడంలో ఎప్పుడూ ముందుంటారు. సినిమా చూసి నిజాయితీగా రివ్యూ ఇవ్వడంలో తప్పులేదు. కానీ కొందరు సినిమా చూడకుండానే రివ్యూ రాస్తున్నారు. మరికొందరైతే కావాలని నెగటివ్ రివ్యూలు రాస్తున్నారు. అలాంటి రివ్యూలను పట్టించుకోకుండా.. ఎందరో ప్రేక్షకులు సినిమాలు చూడటానికి ముందుకొస్తున్నారని అన్నారు. 'గామి', 'గ్యాంగ్స్ ఆఫ్ గోదావరి' ఇలా విశ్వక్ సేన్ సినిమాల ఎంపిక వైవిధ్యంగా ఉందని ప్రశంసలు రావడం ఆనందంగా ఉందని, ఇక ముందు కూడా ఇలాగే ప్రేక్షకులకు కొత్తదనం ఉన్న సినిమాలను అందిస్తానన్నారు. సినిమాకి వస్తున్న స్పందనతో చాలా హ్యాపీగా ఉన్నామని త్వరలో సక్సెస్ మీట్ నిర్వహిస్తామన్నారు. దర్శకుడు కృష్ణ చైతన్య మాట్లాడుతూ.. ప్రేక్షకుల నుంచి వస్తున్న స్పందన పట్ల చాలా సంతోషంగా ఉన్నామని. యువత యాక్షన్ సన్నివేశాలను, డైలాగ్స్ ని బాగా ఎంజాయ్ చేస్తున్నారన్నారు. ముఖ్యంగా మహిళా ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన లభిస్తోందని.. సెకండాఫ్ లో ఎమోషనల్ సన్నివేశాలు బాగా కనెక్ట్ అయ్యామని చెబుతుంటే హ్యాపీగా ఉందన్నారు. బాలకృష్ణగారు, వారి కుటుంబం సినిమా చాలా బాగుందని అభినందించడం.. మాటల్లో చెప్పలేని ఆనందాన్ని కలిగించిందని అన్నారు.

# ఎమోషనల్ ఫ్యామిలీ డ్రామా
# మనమే



శర్వానంద్, కృతి శెట్టి జంటగా వస్తున్న సినిమా 'మనమే' జూన్ 7న విడుదలవుతోంది. శ్రీరామ్ ఆదిత్య దర్శకుడు, నిర్మాత టిజి విశ్వప్రసాద్. ఈ నేపథ్యంలో కథానాయకురాలు కృతి శెట్టి మూవీ విశేషాలని విలేకరుల సమావేశంలో పంచుకున్నారు. ఇందులో నా క్యారెక్టర్ పేరు సుభద్ర. ఇప్పటి వరకూ నేను చేసిన క్యారెక్టర్స్ కి డిఫరెంట్ గా వుంటుంది. నాకు చాలా కొత్తగా వుంటుంది. ఇప్పటివరకూ క్యూట్, సాఫ్ట్, బబ్లీ క్యారెక్టర్స్ చేశాను. కానీ ఈ క్యారెక్టర్ చాలా స్ట్రిక్ట్ గా వుంటుంది. షూటింగ్ సమయంలో డైరెక్టర్ శ్రీరామ్ గారిని ఇంత స్ట్రిక్ట్ గా వుంటుందా?! అని చాలా సార్లు అడిగాను. ఆయన అంత స్ట్రిక్ట్ గా కావాలని చెప్పారు. ఆయన విజన్ని ఫాలో అయ్యాను. పర్శనల్ గా నాకు పెద్ద కోపం రాదు. పెద్దగా అరవను. చాలా కామ్ గా వుంటాను. సుభద్ర క్యారెక్టర్ నాకు పూర్తిగా కొత్త. శర్వానంద్ గారు వన్ అఫ్ ది బెస్ట్ పెర్ఫార్మర్. నిన్న సినిమా చూశాను. ఆయన ప్రతి సీన్ లో అద్భుతంగా పెర్ఫార్మ్ చేశారు. ఆయన ఎక్స్ పీరియన్స్ కనిపించింది. ఇందులో నాకు ఓ ఫేవరట్ సీన్ వుంది. ఆ సీన్ కోసం చాలా వెయిట్ చేశాను. ఎలా చేయాలో అని చాలా అలోచించాను. కానీ శర్వానంద్ గారు చాలా కాజ్యువల్ గా వచ్చి ఆ సీన్ ని ఒక్క నిమిషంలో అద్భుతంగా ఫినిష్ చేశారు. నేను స్టన్ అయిపోయాను. శర్వానంద్ గారు పెర్ఫార్మెన్స్ ని మ్యాచ్ చేయడం చాలా కష్టం. తనతో వర్క్ చేయడం చాలా ఆనందంగా వుంటుంది. అందులో ఒక బేబీ కూడా వుంది. బేబీ తో షూట్ చేయడం అంత ఈజీ కాదు. అయితే శర్వానంద్ గారు చాలా బ్యూటీఫుల్ గా హ్యాండిల్ చేశారు.


'మనమే' స్ట్రాంగ్ ఎమోషన్ కనెక్ట్ వున్న ఎంటర్ టైనింగ్ ఫిల్మ్. ఇందులో వండర్ ఫుల్ కిడ్, పేరెంట్ ఎమోషన్ వుంది. అది గ్లోబల్ ఆడియన్స్ కి కనెక్ట్ అవుతుంది. ఈ సినిమా మా ముగ్గురి క్యారెక్టర్స్ చుట్టూ వుంటుంది. అందుకే మనమే అనే పేరు పెట్టాం. ఇది పెర్ఫెక్ట్ ఫ్యామిలీ ఎంటర్ టైనర్. అందరికీ కనెక్ట్ అవుతుంది. ప్రతి సీన్ లో ఎంటర్ టైన్మెంట్ వుంటుంది.సక్సెస్ ఫెయిల్యూర్ మన చేతిలో వుండదు. మన చేతిలో లేని విషయాలు గురించి ఎక్కువగా ఆందోళన చెందకూడదని ఈ ప్రయాణంలో నేర్చుకున్నాను. నాకు ప్రిన్సెస్ క్యారెక్టర్స్ చేయడం ఇష్టం. 'బాహుబలి' లో అనుష్క గారి లాంటి క్యారెక్టర్స్. మూడు తమిళ్ ఫిలిమ్స్ చేస్తున్నాను. అలాగే టోవినో థామస్ తో ఒక మలయాళం ఫిల్మ్ చేస్తున్నాను అని వివరించారు.



# పదికోట్లు ఇస్తామని చెప్పినా.. నో అన్న బన్నీ
## టొబాకో యాడ్‌లో నటించేందుకు నిరాకరణ

'పుష్ప'తో పాన్ ఇండియా స్థాయిలో మంచి గుర్తింపు తెచ్చుకున్న అల్లు అర్జున్ పొగాకు కంపెనీల ఉత్పత్తుల్లో నటించేందుకు నిరాకరించారు. ఓ యాడ్‌లో నటిస్తే పదికోట్లు ఇస్తామన్న ఆఫర్‌ను సున్నితంగా తిరస్కరించారు. ఇలా పొగాకు ఉత్పత్తులకు సంబంధించి తన దగ్గరకు వచ్చిన ఓ ప్రకటనను మరో ఆలోచన లేకుండా తిరస్కరించారు. అభిమానులను తప్పుదోవ పట్టించి, వారి ఆరోగ్యానికి నష్టం కలిగేలా ఎప్పుడూ ప్రవర్తించనని స్పష్టం చేశారు. కేవలం నటన మాత్రమే కాదు, సామాజిక బాధ్యతల విషయంలో అల్లు అర్జున్ ముందుంటారు. ఇప్పటికే మొక్కలు నాటే కార్యక్రమానికి తనవంతు ప్రచారం చేస్తూ, అభిమానులను సైతం ప్రోత్సహిస్తున్నారు. డబ్బు, పేరు ప్రఖ్యాతులు కన్నా కూడా అభిమానుల ప్రేమకే ఎక్కువ విలువ ఇస్తానని పలు వేదికలపైనా చెప్పారు. వరల్డ్ టుబాకో డే సందర్భంగా ఈ విషయం ప్రస్తుతం సామాజిక మాధ్యమాల వేదికగా చక్కర్లు కొడుతోంది. సుకుమార్ దర్శకత్వంలో అల్లు అర్జున్ కథానాయకుడిగా తెరకెక్కిన యాక్షన్ థ్రిల్లర్ 'పుష్ప: ది రైజ్'. ఈ మూవీ విడుదలైన తర్వాత దేశవ్యాప్తంగా పుష్పరాజ్‌కు విపరీతమైన క్రేజ్ వచ్చింది. దీనిని దృష్టిలో పెట్టుకుని ఓ ప్రముఖ పొగాకు ఉత్పత్తుల సంస్థ బన్నిని కలిసింది. తమ ఉత్పత్తులకు ప్రచారకర్తగా ఉండాలని కోరింది. ఈ ఆఫర్‌ను ఆయన నిర్మొహమాటంగా తిరస్కరించారట. ఈ యాడ్ చేస్తే రూ.10 కోట్ల వరకూ ఇస్తామని ఆఫర్ చేసినా, చేయనని స్పష్టంగా చెప్పారట. నేరుగా తీసుకోకపోయినా 'పుష్ప: ది రూల్'లో పుష్పరాజ్ ధూమపానం చేసే ప్రతి సీన్‌లోనూ బ్యాగ్రౌండ్‌లో తమ బ్రాండ్ లోగో కనిపించేలా చూడాలని కోరిందట. అందుకు కూడా బన్ని నో చెప్పారట. ప్రస్తుతం ఆయన నటిస్తున్న 'పుష్ప2: ది రూల్' ఆగస్టు 15న ప్రేక్షకుల ముందుకు రానుంది. రష్మిక కథానాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో ఫహద్ ఫాజిల్, సునీల్, రావు రమేశ్, అనసూయ, ధనుంజయ కీలక పాత్రలు పోషిస్తున్నారు. దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్న ఈ చిత్రాన్ని మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తోంది. ఇటీవల విడుదల చేసిన ఈ చిత్రంలోని పాటలు యువతను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.



# కనెక్ట్ కాలేక పోయిన ..
# మిస్టర్ అండ్ మిసెస్ మహి

స్పోర్ట్స్ డ్రామాలకి పెట్టింది పేరు బాలీవుడ్. హాకీ మొదలుకుని కుస్తీ వరకూ పలు రకాల క్రీడల్ని స్పృశిస్తూ సినిమాలు రూపొందు తుంటాయి. ఈ మధ్యే అజయ్ దేవగణ్ 'మైదాన్' వచ్చింది. ఇప్పుడు క్రికెట్ నేపథ్యంలో 'మిస్టర్ అండ్ మిసెస్ మహి'. రాజ్ కుమార్ రావ్, జాన్వీ కపూర్ జంటగా నటించడం.. అగ్ర నిర్మాత కరణ్ జోహార్ ధర్మ ప్రొడక్షన్స్ నుంచి వస్తుండడంతో ఈ సినిమాపై అంచనాలు నెలకొన్నాయి. మహేంద్ర (రాజ్ కుమార్ రావ్) ఓ ఫెయిల్యూర్ క్రికెటర్. మరో ఏడాది అవకాశమిస్తే తానేంటో నిరూపించుకుంటానని బతిమాలతాడు. అయినా తండ్రి వినిపించుకోకుండా తన స్పోర్ట్స్ షాప్ నిర్వహణ బాధ్యతల్ని అప్పగిస్తాడు. మహిమ అగర్వాల్ (జాన్వీ కపూర్)తో పెళ్లి చూపులు ఏర్పాటు చేస్తారు. తన ఫెయిల్యూర్ స్టోరీ చెప్పినప్పటికీ మహేంద్ర మనసు నచ్చి పెళ్లి చేసుకోవడానికి అంగీకారం తెలుపుతుంది మహిమ. వైద్యురాలైన ఆమెకీ క్రికెట్ అంటే పిచ్చి. అలా ఆ ఇద్దరి క్రికెట్ ప్రేమ వాళ్లని ఎక్కడిదాకా తీసుకెళ్లింది? విజయవంతమైన క్రికెటర్ కావాలనుకున్న మహేంద్ర కలలు ఎలా నెరవేరాయనేది మిగతా కథ. సాంకేతికంగా సినిమా ఉన్నతంగా ఉంది. అనయ్ గోస్వామి కెమెరా పనితనం మెప్పిస్తుంది. పాటలు బాగున్నాయి. జాన్ స్టీవార్ట్ ఏడూరి నేపథ్య సంగీతం సినిమాపై ప్రభావం చూపించింది.



# ప్రెస్ క్లబ్‌కు అండగా ఉంటా..

**వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి**

**క్రీడల పోస్టర్ ఆవిష్కరణ**

**వరంగల్ వాయిస్, హనుమకొండ :** గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్‌కు ఎల్లవేలలా అండగా ఉంటానని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి హామీ ఇచ్చారు. గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ ఆధ్వర్యంలో నిర్వహించతలపెట్టిన స్పోర్ట్స్ మీట్-2024 పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమం శనివారం ప్రెస్ క్లబ్ లో గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేముల నాగరాజు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి మాట్లాడుతూ..తాను రాజకీయాల్లోకి వచ్చినప్పటి నుంచి పదవులున్నా, లేకున్నా జర్నలిస్టులతో స్నేహపూర్వకంగానే మెదులుతున్నానన్నారు. మంచి, చెడులలో చేదోడు, వాదోడుగా నిలుస్తున్నానన్నారు. క్లబ్ ఆధ్వర్యంలో క్రీడా పోటీలు నిర్వహించటం అభినందనీయమన్నారు. నిత్యం ఉరుకులు, పరుగులతో వార్తల సేకరణలో బిజీగా ఉండే జర్నలిస్టులకు క్రీడలు ఒక ఆటవిడుపుని అన్నారు. ఈ సందర్భంగా స్పోర్ట్స్ మీట్-2024 పోస్టర్ ను క్లబ్ బాధ్యులతో కలసి నాయిని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రధాన కార్యదర్శి బొల్లారపు సదయ్య, కోశాధికారి బొల్ల అమర్, జర్నలిస్టు సంఘాల నేతలు బీఆర్ లెనిన్, తోట సుధాకర్, గడ్డం కేశవమూర్తి, గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ బాధ్యులు, పలువురు జర్నలిస్టులు పాల్గొన్నారు.

**7నుంచి క్రీడలు..**

గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో సభ్యత్వం కలిగి ఉన్న సభ్యులకు ఈ నెల 7, 8, 9 ,10 తేదీల్లో నాలుగు రోజుల పాటు క్రికెట్, వాలీబాల్, షటిల్, క్యారం, చెస్ పోటీలను నిర్వహించాలని గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ కమిటీ నిర్ణయించడం జరిగిందని బాధ్యులు వెల్లడించారు. అందులో భాగంగా ఇప్పటికే క్రీడా పోటీల్లో పాల్గొనేందుకు ఆసక్తి ఉన్న సభ్యుల పేర్ల నమోదుకు ప్రకటన చేసి, వచ్చిన పేర్లతో కూడిన జాబితాను క్రీడా అంశాల వారిగా డ్రా తీయడం జరిగిందన్నారు.

# రేపు తెలంగాణ దశాబ్ది ఉత్సవాలు

**ఉదయం గన్‌పార్క్‌లో సీఎం రేవంత్ నివాళి**

**పరేడ్ గ్రౌంలో జెండా ఆవిష్కరణ**

**ప్రజలను ఉద్దేశించి ప్రసంగం**

**ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు**

**జయజయహే తెలంగాణ గీతావిష్కరణ**

**కవులు, కళాకారులు, ఉద్యమకారులకు సన్మానం**

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఆదివారం జూన్ 2న అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఏర్పాట్లు చేసింది. ఈ వేడుకల్లో అందరినీ భాగస్వాములను చేయనుంది. గత పదేండ్లలో లేని విధంగా అందరినీ కలుపుకుని, రాజకీయాలకు అతీతంగా ఆవిర్భావ వేడుకలు నిర్వహించాలని రాష్ట్ర సర్కార్ నిర్ణయించింది. ఉదయమే గన్‌పార్క్ వద్ద అమరులకు సీఎం రేవంత్ రెడ్డి నివాళి అర్పించి, అక్కడి నుంచి పరేడ్ గ్రౌండ్స్‌లో జెండా ఆవిష్కరించి గౌరవ వందనం స్వీకరిస్తారు. ఈ ఉత్సవాలకు గవర్నర్ రాధాకృష్ణన్‌ను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క స్వయంగా కలిసి ఆహ్వానించారు. ముఖ్య అతిథిగా రావాలని సోనియాను ఆహ్వానించినా అనారోగ్య కారణాలతో ఆమె రాక అనుమానమేనని అంటున్నారు. మరోవైపు తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా హైదరాబాద్‌లోని ట్యాంక్‌బండ్ పరిసరాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. జూన్ 2న ఉదయం పరేడ్ మైదానంలో జాతీయ జెండా ఆవిష్కరణ, ఇతర కార్యక్రమాలు ఉంటాయి. సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తారు.

**జయజయహే తెలంగాణ గీతం జాతికి అంకితం..**

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా రాష్ట్రంలోని వివిధ జిల్లాలకు చెందిన కళాబృందాలతో ప్రత్యేక ప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నారు. అలాగే ఈ సందర్భంగా జయజయహే తెలంగాణ గీతాన్ని సీఎం రేవంత్ రెడ్డి జాతికి అంకితం చేయనున్నారు. కళాకారులు, కవులు, ఉద్యమకారులను సన్మానించానున్నారు. గత ప్రభుత్వం 2014 నుంచి 2023 దాకా పదేండ్లలో ఒక్కసారి కూడా ఉద్యమకారులను ఆవిర్భావ వేడుకలకు ఆహ్వానించలేదు. కానీ ప్రస్తుత ప్రభుత్వం ఆవిర్భావ వేడుకల్లో పాల్గొనాలని ఉద్యమకారులందరికీ ఆహ్వానం పంపించింది. కలెక్టర్ల ద్వారా ఆహ్వానాలు వెళ్లాయి. ఆవిర్భావ వేడుకల్లో ఆదివారం ఉదయం పరేడ్ గ్రౌండ్‌లో పోలీసుల కవాతు ఉంటుంది. ఈ కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి ప్రజలను ఉద్దేశించి మాట్లాడతారు.

**సాంస్కృతిక కార్యక్రమాలు..**

సాయంత్రం ట్యాంక్‌బండ్‌పై సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. కార్నివాల్, లేజర్ షో లాంటి కార్యక్రమాలతో పాటు ఫుడ్, గేమింగ్ స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నారు. ట్యాంక్ బండ్ పై జాతీయ జెండాలతో మార్చ్-ఫాస్ట్ కూడా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమాలకు సీఎం రేవంత్, మంత్రులు, ఇతర ప్రముఖులు హాజరుకానున్నారు. తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని హైదరాబాద్‌లోని ప్రధాన ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు ఉంటాయని పోలీసులు ప్రకటించారు. ఈ ఆంక్షలు శనివారం ఉదయం నుంచి ఆదివారం రాత్రి 12 గంటల వరకు కొనసాగుతాయని వెల్లడించారు.

## ఆవిర్భావ వేడుకలకు గవర్నర్‌కు ఆహ్వానం

**అనారోగ్య కారణాలతో సోనియా పర్యటన రద్దు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జూన్ 2న అంగరంగ వైభవంగా నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ధి ఉత్సవాల్లో పాల్గొనవలసిందిగా రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్‌ను శనివారం రాజ్ భవన్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కలిసి ఆహ్వానం పలికారు. ఈ మేరకు గవర్నర్ కు పూల బొకే అందించారు. ఈ సందర్భంగా గవర్నర్ తో కొద్దిసేపు వారు భేటీ అయ్యారు. సీఎం ఆహ్వానంపై గవర్నర్ సానుకూలంగా స్పందించారు.

**సోనియా పర్యటన రద్దు..**

తెలంగాణ దశాబ్ధి ఉత్సవాలకు సోనియా గాంధీ హాజరు కావడం లేదు. అనారోగ్య కారణాలతో సోనియా రాష్ట్ర వేడుకల్లో పాల్గొనలేక పోతున్నట్లు కాంగ్రెస్ వర్గాలు ప్రకటించాయి. తెలంగాణ ఇచ్చిన సోనియా గాంధీని ఉత్సవాలకు హాజరు కావాల్సిందిగా ముఖ్యమంత్రి ఢిల్లీకి పోయి ఆహ్వానించారు. అమె ఉత్సవాల్లో పాల్గొనేందుకు రాష్ట్రానికి వస్తున్నట్లు ప్రచారం కూడా సాగింది.

# ఘనంగా హనుమాన్ జయంతి వేడుకలు

**కొండగట్టుకు తరలిన భక్తులు**

**ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు**

**వరంగల్ వాయిస్, వరంగల్ :** జిల్లా వ్యాప్తంగా హనుమాన్ పెద్ద జయంతి వేడుకలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాలధారులు పెద్ద ఎత్తున కొండగట్టుకు తరలి వెళ్లారు. దీంతో జగిత్యాల జిల్లా కొండగట్టు ఆలయ ప్రాంగణంలో హనుమాన్ భక్తుల హడావుడి నెలకొంది. జై శ్రీరామ్ నినాదాలతో ఆలయ ప్రాంగణం మారుమ్రోగింది. జూన్ 1వ తేదీ ఉదయం 7.24 గంటలకు ప్రారంభమైన ఉత్సవాలు జూన్ 2వ తేదీ ఉదయం 5.04 గంటలకు ముగియనున్నాయి. జ్యోతిష్య శాస్త్రంలో హనుమంతుడు శనిశ్వరుడి అత్యంత శక్తివంతమైన రూపంగా పరిగణించ బడుతున్నాడు. హనుమాన్ జయంతోత్సవం రోజున పూజలు చేయడం ద్వారా శని చెడు ప్రభావాల నుంచి బయటపడవచ్చని భక్తుల నమ్మకం. దీంతో హనుమాన్ జయంతోత్సవాన్ని తెలుగు రాష్ట్రాల్లో ఘనంగా జరుపుకుంటున్నారు. 41 రోజులపాటు దీక్ష చేసిన స్వాములు ఈరోజు హనుమాన్ దేవాలయంలో దీక్షను విరమించారు.

**హనుమకొండలో..**

హనుమకొండ పద్మాక్షి కాలనీలోని శ్రీ హనుమద్గిరి ప్రసన్నాంజనేయ స్వామి దేవాలయంలో శనివారం జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. వేద పండితులు ఆరుట్ల రామాచార్యులు, భాస్కరాచార్యుల ఆధ్వర్యంలో మూల విరాట్ కు స్వాములచే అభిషేకం, చందన సేవ, అలంకరణ, అర్చనలు నిర్వహించారు. అనంతరం మహా పూర్ణాహుతి, ధ్వజారోహణ సేవ చేశారు. మధ్యాహ్నం శ్రీ ఆంజనేయం మున్నూరు కాపు సంఘం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 30వ డివిజన్ కార్పొరేటర్ రావుల కోమల కిషన్, డాక్టర్ గుమ్మ మధుసూధన్, ప్రసాద్, న్యూరోఫిజీషియన్ డాక్టర్ శైలశ్రీ, ఆలయ చైర్మన్ బెండల అర్జున్ రావు, అధ్యక్షుడు గందె కృష్ణ, ప్రధాన కార్యదర్శి కనుకుంట్ల రవికుమార్, అంబటి నరేందర్, మాదాసు మొగులయ్య, కర్రు దశరథ్ కుమార్, గంద్రాతి సుధాకర్, సమ్మయ్య, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# అంజన్నకు తేనెతో అభిషేకం

**పాల్గొన్న పశ్చిమ ఎమ్మెల్యే నాయిని**




**వరంలగ్ వాయిస్, కాశిబుగ్గ :** నగరంలోని శ్రీ వర దత్త క్షేత్రంలో శనివారం వేలాది మంది భక్తులు శ్రీ కార్య సిద్ధి ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. భక్తులచే ఉత్సవ మూర్తికి చందన అభిషేకం.. వడ మాలల సేవలు నిర్వహించారు. అనంతరం భక్తులు 41 మార్లు హనుమాన్ చాలీసా పారాయణం చేయగా అర్చకులు రాపాక గోపి కృష్ణ శర్మ గర్భ ఆలయంలో మూల మూర్తికి వేద మంత్రాలు, తేనెతో అభిషేకం నిర్వహించారు. అనంతరం మహా అలంకరణ, మహా మంగళ హారతి నిర్వహించారు. భక్తులందరికీ తీర్థ ప్రసాద వితరణ, మహా అన్న దానం జరిగింది. హనుమాన్ జయంతి సందర్భంగా వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి దత్త క్షేత్రం సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామీ వారి ప్రసాదలు, శేష వస్త్రాలు ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు వైవి.వామన్ రావు, డాక్టర్ కాంటెమ్ లక్ష్మి నారాయణ, ప్రొఫెసర్ కె.కృష్ణ ప్రసాద్, బెండల అర్జున్ రావు, చెకిలం ఏకంబరం, డాక్టర్ వద్దిరాజు శార్వాణి, విజేందర్ రెడ్డి, యుగంధర్, కుమారస్వామి, జూలూరి శ్రీనివాస్, అర్చకులు రాపాక గోపి కృష్ణ శర్మ, భక్తులు, మాతృ మండలి సభ్యులు పాల్గొన్నారు.

# గ్రూప్-1 ప్రిలిమ్స్ హాల్‌టిక్కెట్లు విడుదల

**వరంగల్ వాయిస్, హైదరాబాద్ :** తెలంగాణలో గ్రూప్-1 ప్రిలిమినరీ పరీక్షకు టీజీపీఎస్సీ ఏర్పాట్లు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా శనివారం హాల్‌టికెట్లను విడుదల చేసింది. జూన్ 9న ఉదయం 10.30గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు జరిగే ఈ పరీక్ష రాసే అభ్యర్థులు కమిషన్ వెబ్‌సైట్ నుంచి హాల్‌టికెట్లు డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. రాష్ట్రంలో 563 గ్రూప్-1 పోస్టుల భర్తీ కోసం ఫిబ్రవరి 23 నుంచి మార్చి 16 వరకు ఆన్‌లైన్ లో దరఖాస్తులు స్వీకరించగా.. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 4.03 లక్షల మందికి పైగా అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. ఉదయం 9 గంటల నుంచే పరీక్ష కేంద్రాల్లోకి అభ్యర్థుల్ని అనుమతించనున్నారు. పది దాటితే పరీక్ష కేంద్రం గేట్లు మూసివేస్తామని.. ఆ తర్వాత ఎవరినీ లోపలికి అనుమతించేది లేదని అధికారులు స్పష్టం చేశారు.

EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY GADDAM KESHAVA MURTHY, PRINTED AT MANIKANTA GRAPHICS, H.NO.4-10-121, KUMARPALLY, HANAMKONDA, WARANGAL URBAN DIST DISTRICT-506001, TELANGANA STATE, PUBLISHED AT H.NO. 4- 7-138/1, KUMARPALLY, HANAMKONDA, WARANGAL.-506001. WARANGAL URBAN DISTRICT, TELANGANA STATE.
EDITOR : GADDAM KESHAVA MURTHY. RNI NO: TELTEL/2021/80377, PHONE NO : 8008794162, MAIL ID : gaddamkeshavamurthy@gmail.com